క్లుప్తంగా

కుళాయిలు ప్రారంభం



పద్మనాభంలో కుళాయిలను ప్రారంభిస్తున్న ఎంపీపీ రాంబాబు

పద్మనాభం: పద్మనాభం గ్రామంలోని బ్రాహ్మణ వీధిలో 15వ ఆర్థిక సంఘం నిధులు 2.80లక్షలతో మండల పరిషత్ ఏర్పాటు చేసిన కుళాయిలను ఎంపీపీ కంటుబోతు రాంబాబు సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కుళాయిల ఏర్పాటుతో బ్రాహ్మణ వీధిలో తాగు నీటి సమస్య పరిష్కారమైందన్నారు. పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, కృష్ణాపురం ఎంపీటీసీ సభ్యురాలు కంటుబోతు లక్ష్మి నాయుడు మాట్లాడుతూ తమ కోరిక మేరకు బ్రాహ్మణ వీధిలో ఎంపీపీ రాంబాబు కుళాయిలు నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు తాలాడ పద్మనాభం, తాలాడ నరసింహనాయుడు, టీడీపీ నాయకుడు కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

అఖిల భారత అథ్లెటిక్స్ పోటీలకు గీతం జట్టు

కొమ్మాది: అఖిల భారత అంతర్ విశ్వవిద్యాలయాల అథ్లెటిక్స్ (పురుషుల) పోటీల్లో పాల్గొనే గీతం విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్టు గీతం క్రీడా విభాగం డైరెక్టర్ డా.యు.విజయ్ కుమార్ తెలిపారు. భువనేశ్వర్‌లోని కిట్ విశ్వవిద్యాలయంలో ఏఐయూ ఆధ్వర్యంలో ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. గీతం జట్టుకు గ్లేన్ ఒపియో, ఎస్.భాను తేజ, కె.హరీష్, డి.ధనిక్ బాబా తదితరులు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు తెలిపారు.

భీమిలి తీరప్రాంతాల్లో షూటింగ్ సందడి



లొకేషన్‌లో నటుడు శివాజీ

కొమ్మాది: భీమిలి తీర ప్రాంతాల్లో సోమవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. ఏబీ సినిమాస్ బ్యానర్‌పై శంకర్ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న సినిమాకు సంబంధించి షూటింగ్ జరుగుతోంది. సోమవారం రుషికొండలోని ఐటీ హబ్‌లో నటులు బ్రహ్మాజీ, శివాజీలపై కొన్ని సన్నివేశాలు చిత్రీకరించారు. భార్గవ్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రంలో షణ్ముఖ్ జశ్వంత్ హీరోగా నటిస్తున్నారు.

గుడ్లవానిపాలెం బీచ్‌లో..

బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ దరి గుడ్లవానిపాలెం బీచ్ వద్ద నూతన నటీనటులతో తెరకెక్కిస్తున్న బ్యూటీ సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. సినిమా పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామని చిత్రం యూనిట్ తెలిపింది.


వివాహిత అదృశ్యం

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఆర్టీవో కార్యాలయం వద్ద దేవుని బొమ్మలు చేసుకుంటూ నివాసం ఉంటున్న రాజస్థానీ కుటుంబానికి చెందిన హస్తుకుమారి అనే వివాహిత ఈ నెల 21న ఇంటి నుంచి అదృశ్యమయింది. నెలరోజుల క్రితం బతుకు తెరువు కోసం శాంతిలాల్, హస్తుకుమారి దంపతులు రాజస్థాన్ నుంచి ఇక్కడికి వచ్చారు. హస్తుకుమారి మధ్యాహ్నం అన్నం వండి కూరలు తీసుకువస్తానని చెప్పి, బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల సాయంతో చుట్టుపక్కల గాలించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో భర్త శాంతిలాల్ సోమవారం ఆనందపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ వాసునాయుడు సూచనల మేరకు హెడ్ కానిస్టేబుల్ వాసు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆధ్యాత్మిక పీఠం వార్షికోత్సవం రేపు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో ఉన్న శ్రీవిశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక శక్తి పీఠం 23వ వార్షికోత్సవం బుధవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా ఆధ్యాత్మిక ప్రవచనాలు అందిస్తారని పేర్కొన్నారు. పలు సేవా కార్యక్రమాలను కూడా నిర్వహిస్తామని తెలియజేశారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి



రాళ్లు తేలిన ఉప్పు గల్లీకి వెళ్లే మార్గం

సాధారణంగా ఇక్కడి ఉప్పును ఆహారంలోకి కాకుండా పశువులు, కొబ్బరిచెట్లు, కోళ్ల దాణా, చేపల చెరువులకు వినియోగిస్తుంటారు. ఎక్కువగా ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం, ఒడిశా, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు ఇక్కడి నుంచి ఉప్పు ఎగుమతి అవుతుంది. భీమిలి పట్టణ ప్రాంతాలలో చాలామందికి ఉప్పు ఎలా తయారవుతుందో తెలియదు, కాబట్టి చుట్టుపక్కల విద్యాసంస్థలు, కుటుంబాలు సీజన్‌లో ఉప్పు తయారీ చూడటానికి ప్రత్యేకంగా ఇక్కడికి వస్తుంటారు.



తుప్పలతో నిండిపోయిన ఉప్పుగల్లీల ప్రాంతం

ముంపులో ఉప్పు గల్లీలు



వర్షం నీటితో నిండిపోయిన మూలకుద్దు ఉప్పుగల్లీలు

- వరుస తుపాన్లతో నిర్జీవం
- ఏటా నవంబరు నుంచి ఉప్పుసాగు ప్రారంభం
- ఇప్పటికే సీజన్‌లో రెండు నెలల కాలం నష్టం
- గతేడాది ఉప్పు ఇంకా గల్లీల్లోనే..



విక్రయం కాకుండా కుప్పలుగా మిగిలిపోయిన ఉప్పు

తగరపువలస:

ఉప్పుగల్లీలు ఇటీవల వర్షాలకు ముంపునకు గురయ్యాయి. భీమిలి మండలం మూలకుద్దులోని పలు ప్రాంతాల్లో ఉప్పు సాగు చేస్తుంటారు. ఈ నెలలో 20 రోజుల వ్యవధిలో రెండు సార్లు అల్పపీడన ప్రభావం కారణంగా వర్షాలతో గల్లీలు నిర్జీవంగా కనిపిస్తున్నాయి. మళ్లీ నీరు తగ్గిన తర్వాతే రైతులు ఇటుగా వచ్చేది.

6 నుంచి 9 నెలల కాలం సాగు

ఏటా వర్షాకాలం ముగిసిన తరువాత దసరా, దీపావళి, నాగులచవితి పండగలు చేసుకుని ఉప్పు సాగుకు శ్రీకారం చుడతారు. మధ్యలో తుపానుల వంటి ఆటంకాలేమీ లేనప్పుడు ఉప్పు సాగు నిరాటంకంగా 6 నెలల నుంచి 9 నెలలు సాగుతుంది. ప్రతి ఏటా కౌలురైతులు నవంబరు, డిసెంబరు నెలల్లో గల్లీలను సిద్ధం చేసుకుని, భీమిలికి దగ్గరలో ఉన్న ఉప్పుటేరు నుంచి నీటిని గల్లీలకు ఆనుకుని చెరువులకు మళ్లిస్తారు. ప్రారంభంలో ఎండలు తక్కువ ఉండటం వలన దిగుబడి కూడా స్వల్పంగా ఉంటుంది. సంక్రాంతి తరువాత ఎండలు పెరుగుతున్న కొద్దీ దిగుబడి పెరుగుతుంది. ఏప్రిల్, మే నెలల్లో దిగుబడి చాలా ఎక్కువగా ఉంటుంది. దిగుబడి ప్రారంభంలో ఎకరాకు వారం రోజుల వ్యవధిలో రెండు బస్తాల దిగుబడి లభించగా ఎండను బట్టి 16 నుంచి 20 బస్తాల వరకు పెరుగుతుంది. 80 కిలోల బస్తా గల్లీల వద్ద ప్రారంభంలో రూ.350 ఉండగా దిగుబడి పెరిగిన తరువాత రూ.200 నుంచి రూ.250కు లభిస్తుంది. **వర్షాల కారణంగా ఇప్పటికే సీజన్‌లో** రెండు నెలల కాలాన్ని ఇక్కడి సాగుదారులు నష్టపోయారు. వాతావరణం అను కూలించకపోవడంతో రైతులెవరూ రాక ఉప్పు గల్లీల ప్రాంతం తుప్పలతో నిండిపోయింది.

సాగుకు అనుకూలంగా 99 ఎకరాలు

భీమిలి మండలంలోని 99 ఎకరాలు ఉప్పు సాగుకు అనుకూలంగా ఉంటుంది. **మూలకుద్దు, రేఖవానిపాలెం** పంచాయతీలకు చెందిన 100 **నుంచి 250 మంది ఈ ఉప్పు గల్లీలలో** ఉపాధి పొందుతుంటారు. **అన్ సీజన్‌లో వీరంతా భవన నిర్మాణ** పనులకు వెళ్లిపోతుంటారు. ఉప్పు సాగు సమయంలో మడుల తయారీ, మట్టి తరలింపు, ఉప్పు సాగు, మోత, రవాణా, ప్యాకింగ్ వంటి పనులు చేస్తుంటారు. ఉప్పు సాగు చేసిన రైతులకు వాతావరణం అనుకూలిస్తే పెట్టుబడికి అయిదు రెట్లు వరకు ఆదాయం పొందుతారు. అయితే, గతేడాది సాగు చేసిన ఉప్పు విక్రయం కాకపోవడంతో ఇప్పటికీ కుప్పలుగా ఉండిపోయాయి.

ఎంతో సందడిగా ఉండేది

చిట్టివలస జ్యూట్‌మిల్లు రన్నింగ్‌లో ఉన్నప్పుడు అక్కడ పని ఉండని వారికి గల్లీలలో పని దొరికేది. 9 మాసాల సాగులోనే కాకుండా మిగిలిన 3 నెలలు రవాణా కారణంగా పని దొరికేది. ఈ గల్లీల ప్రాంతం సందడిగా ఉండేది. ప్రత్యేకంగా చూడటానికి వెళ్లేవాళ్లం. ప్రస్తుతం అకాల వర్షాలతో గల్లీలు వైభవం కోల్పోయాయి.

– ధర్మాల సూర్యం, భీమిలి

చెరువు వద్ద హెచ్చరికల బోర్డుల ఏర్పాటు



నమ్మివానిపేట చెరువు వద్ద జీవీఎంసీ ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ రెండోవార్డు నమ్మివానిపేట చెరువు చుట్టూ హెచ్చరికల బోర్డులు ప్రత్యక్షమయ్యాయి. కొంతకాలంగా ఇక్కడి చెరువును స్థానికులు భవన నిర్మాణ వ్యర్థాలతో నింపివేస్తుండటంతో చెరువు వైశాల్యం చిక్కిపోయింది. ఈ నేపథ్యంలో 'చెరువు ఆనవాళ్లే కరువు' శీర్షికతో ఈ నెల 10న సాక్షిలో ప్రచురితమైన కథనంపై జీవీఎంసీ అధికారులు స్పందించారు. చెరువు చుట్టూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు.

కరాటేలో రిత్విక్ ప్రతిభ



రిత్విక్‌ను సత్కరిస్తున్న కరాటే అసోసియేషన్ సభ్యులు

పీఎం పాలెం: జీవీఎంసీ ఆరో వార్డు పరిధి పీఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీకి చెందిన దాసరి ఈశ్వర సాయి రిత్విక్ (7) కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచి, ప్రశంసలందుకుంటున్నాడు. రిత్విక్ కాకినాడలో విక్టరీ షాటోకాన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 3వ జాతీయ కరాటే పోటీల్లో రెండు బంగారు పతకాలు సాధించాడు. ఈ సందర్భంగా రిత్విక్‌ను వింగ్స్ షాటోకాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. సాయి రిత్విక్ తండ్రి సూరిబాబు జీవీఎంసీ చెత్త సేకరణ వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నారు. స్థానిక ప్రైవేట్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న రిత్విక్ విశాఖ వింగ్స్ షాటోకాన్ కరాటే శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో ప్రధాన కరాటే శిక్షకుడు సాయికుమార్, మల్లికార్జునగౌడ్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 10 అర్జీలు

పింఛన్ తీసేస్తామంటున్నారని ఓ వృద్ధురాలి ఆవేదన



జోన్-2 పీజీఆర్ఎస్‌లో దరఖాస్తు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి జెడ్సీ ఫణిరాం

మధురవాడ: జీవీఎంసీ మధురవాడ జోన్-2 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 10 అర్జీలు వచ్చాయి. ఇన్‌చార్జి జోనల్ కమిషనర్ ఫణిరాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

- తనకు పింఛన్ తీసేస్తున్నామని సచివాలయ సిబ్బంది చెబుతున్నారని, ఏ ఆధారం లేని తనకు ఫించనే జీవనాధారమని ఆర్‌జీకే కాలనీకి చెందిన చిట్టితల్లి జెడ్సీకి తెలియజేశారు. అది లేకపోతే ఎలా బతకాలంటూ వాపోయారు.
- ఫుట్‌పాత్‌పై ఆక్రమణలు తొలగించాలని కె.లక్ష్మణ, రోడ్లపై ఆవులు, మేకలు కట్టడం వలన రాకపోకలకు ఇబ్బంది కలుగుతుందని కె.రాంజీ ఫిర్యాదులు ఇచ్చారు.
- బక్కన్నపాలెం, ఇతర ప్రాంతాలలో వీధిలైట్ల కోసం వి.రాంబాబు, డి.సూర్యప్రసాదరావు వేర్వేరుగా ఫిర్యాదులు ఇచ్చారు.

కార్యక్రమానికి వివిధ విభాగాల అధికారులు కూడా సక్రమంగా హాజరు కావడం లేదు.

భీమిలి జోన్‌లో..

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు రెండు వినతులు వచ్చాయి. రెవెన్యూ విభాగానికి ఒకటి, ఇంజినీరింగ్ విభాగానికి ఒక వినతి వచ్చాయి. వాటిని పరిశీలించి పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

ఉన్నతాధికారుల దృష్టికి రైతు బజార్ సమస్యలు



దాట్ల హరిత, ఇన్‌చార్జి ఈవో

మధురవాడ: రైతుబజారులో సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి చర్యలు చేపడతామని మధురవాడ రైతుబజార్ సూపర్ వైజర్, ఇన్‌చార్జి ఈవో దాట్ల హరిత తెలిపారు. గాజువాక నుంచి బదిలీపై వచ్చిన ఆమె ఇటీవల బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ బజారు వద్ద ట్రాఫిక్ తదితర సమస్యలు గుర్తించామని, ఉన్నతాధికారులకు తెలియజేసి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

మాజీ కౌన్సిలర్ జీవీకి పరామర్శ



రమణను పరామర్శిస్తున్న నాయకులు

తగరపువలస: ఇటీవల అస్వస్థత కారణంగా ఇంటికే పరిమితమైన భీమిలి మున్సిపాల్టీ మాజీ కౌన్సిలర్ జీవీ రమణను జీవీఎంసీ ఒకటో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. సంతపేటలోని ఆయన ఇంటికి వార్డు అధ్యక్షుడు జగుపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు చేరుకుని, ఆరోగ్యంపై ఆరాతీశారు. త్వరగా కోలుకుని పార్టీకి సేవలు అందించాలని ఆకాంక్షించారు. జీవీని పరామర్శించిన వారిలో నాయకులు పందిరి విజయ్, సిమ్మల ప్రసన్న, చింతగుంట శివ, గంద్రేటి ఈశ్వరరావు, తమ్మిన కూర్మారావు, నీలాపు రామిరెడ్డి, వెంకటరావు, రమేష్, విజయసారథి ఉన్నారు.

కలెక్టర్‌కు వినతి

మధురవాడ: జీవీఎంసీ 5వ వార్డులోని పలు సమస్యలను కార్పొరేటర్ మొల్లి హేమలత జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ మేరకు పీజీఆర్ఎస్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. పశువుల ఆస్పత్రి నిర్మాణానికి స్థలం కేటాయింపు, అంగన్‌వాడీ కేంద్రాల ఏర్పాటు తదితర సమస్యలను తెలియజేశారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రాజెక్టులు

పాఠశాలల్లో ఘనంగా గణిత దినోత్సవం



గణిత ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవో రమణ

పద్మనాభం: పద్మనాభం గోస్తని విద్యాపీఠంలో సోమవారం గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రముఖ గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన గణితానికి అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు 25 గణిత ప్రాజెక్టులను రూపొందించి, ప్రదర్శించారు. వీటితో పాటు సైన్స్, సోషల్‌కు సంబంధించి ప్రాజెక్టును ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టులను ఎంఈవో రమణ తిలకించి, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో గోస్తని విద్యాపీఠం కరస్పాండెంట్ కాళ్ల వరలక్ష్మి, హెచ్ఎం ములపర్తి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస రామానుజన్‌కు నివాళులు

తగరపువలస: భీమిలి మండలం చిప్పాడ జెడ్పీ హైస్కూల్‌లో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్‌కు విద్యార్థులు, ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. విద్యార్థులకు గణితంలో క్విజ్, వివిధ అధ్యాయాలపై పోటీలు నిర్వహించారు. అనంతరం బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని ఎంపీటీ రత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మధురవాడ: వినియోగదారుల హక్కులపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా కన్స్యూమర్ డిస్ప్యూట్స్ రిడ్రెసల్ కమిషన్ సభ్యురాలు రెహామున్నీసా బేగం సూచించారు. చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించి, ర్యాలీ నిర్వహించారు. ప్రతి విద్యార్థి కుటుంబంలోని సభ్యులు వినియోగదారులేనని, కొన్న వస్తువుల నాణ్యత తెలుసుకోవడం వారి హక్కని పేర్కొన్నారు. కొన్న వస్తువులకు రసీదు పొందినప్పుడు, వాటి నాణ్యతలో వచ్చిన లోపాలపై ఫోరంను సంప్రదించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం రవి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సుకు 50 దరఖాస్తులు



రెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ రామారావు, ఎంపీపీ వాసురాజు

తగరపువలస: భీమిలి మండలం అమనాంలో సోమవారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారం కోరుతూ 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. తహసీల్దార్ పైల రామారావు మాట్లాడుతూ దీర్ఘకాలంగా ఉన్న భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సదస్సులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి ఎంపీపీ దంతులూరి వాసురాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్వేయర్ సంధ్య, స్థానిక నాయకులు కంబపు శివకుమార్, మరగడ రఘురామిరెడ్డి, చుక్క ఆదిరెడ్డి, కొల్లి నరసింహులు పాల్గొన్నారు.

రుషికొండ బీచ్ సౌత్ రోడ్డు పునఃప్రారంభం



రోడ్డును పునఃప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్

కొమ్మాది: ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్ సౌత్ రోడ్డులో రాకపోకలు సోమవారం పునఃప్రారంభం అయ్యాయి. ఎంపీ శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రుషికొండ అందాలను చూసేందుకు వచ్చే పర్యాటకులకు ఈ రహదారి కొత్త అనుభూతిని కలిగిస్తుందన్నారు. వారాంతంలో అధిక సంఖ్యలో వచ్చే పర్యాటకులు ఒక్క దారితో ఇబ్బంది పడేవారని, ఇప్పుడా అవస్థలు తప్పుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, జెడ్సీ ఫణిరామ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ కాంతులు

విద్యుత్ వెలుగుల్లో పురాతన ప్రార్థన మందిరాలు



చిట్టివలసలో 224 ఏళ్ల నాటి లండన్ మిషన్ చర్చి



బంగ్లామెట్టలో విద్యుద్దీపాల అలంకరణలో సీయోను ప్రార్థన మందిరం

తగరపువలస: క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలోని ప్రార్థనా మందిరాలు ముస్తాబవుతున్నాయి. విద్యుత్ కాంతుల్లో చర్చిలు దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి. మంగళవారం రాత్రి నుంచి ఆయా చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభం కానున్నాయి. క్రీస్తు రాకకు గుర్తుగా చర్చి, ఇళ్లపై స్టార్‌లతో పాటు ఇంట్లో క్రిస్మస్ చెట్లను విద్యుద్దీపాలతో అలంకరించారు. అంతటా ఈ వేడుకలు ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి.

పోలమాంబ హుండీల ఆదాయం రూ.4.05 లక్షలు



ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న శ్రీహరి సేవా సమితి ప్రతినిధులు

తగరపువలస: సంగివలస పోలమాంబ (ముగ్గురు అమ్మవార్ల) ఆలయ హుండీలను దేవదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం లెక్కించారు. అక్టోబర్ 30 నుంచి సోమవారం వరకు 55 రోజులకు సంబంధించి రూ.4,05,792 ఆదాయం లభించిందని ఆలయ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా తెలిపారు. హుండీల లెక్కింపులో నగరానికి చెందిన శ్రీహరి సేవాసమితి సిబ్బంది పాల్గొనగా ఇన్‌స్పెక్టర్‌గా పి.ఎస్.ఎస్.మూర్తి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కోరాడ శ్రీను, అర్చకులు నరసింహమూర్తి, ఏడిద రామకృష్ణ శర్మ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కర్ణాటక సంగీత కచేరీ



సంకీర్తనలను ఆలపిస్తున్న గాయని

భీమునిపట్నం: శారదమణిదేవి జయంత్యుత్సవాలు భీమిలిలోని శారద రామకృష్ణ సంఘం మందిరంలో ఘనంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కర్ణాటక సంగీత కచేరీ ఆహూతులను ఆకట్టుకుంది. విశాఖకు చెందిన ఎం.విజయశ్రీ, విజయనగరానికి చెందిన ఎస్.రుషీశ్వరరావు, శ్రీకాకుళానికి చెందిన టి.పావని ఆలపించిన సంకీర్తనలు అలరించాయి.

సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలి

పద్మనాభం: పెందుర్తిలో ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ నాయకులు రవ్వ నర్సింగరావు, ఎస్.అప్పలనాయుడు పిలుపునిచ్చారు. పద్మనాభం గ్రామంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద సోమవారం వారు మాట్లాడుతూ పెందుర్తిలో ఈ నెల 28వ తేదీ ఉదయం పది గంటలకు ప్రారంభం కానున్న బహిరంగ సభకు రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సింగిడి రాము, ఎస్.పద్మనాభం, కృష్ణ, ఎం.అప్పారావు, పి.రమణ పాల్గొన్నారు.